సీతాఫల్‌మండిలో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ బుధవారం ప్రారంభించారు. సీతాఫల్‌మండి డబుల్‌బెడ్ రూమ్ ప్రాంతంలో రూ. 17 లక్షల వ్యయంతో వరదనీటి పైప్‌లైన్, ఫ్రైడే మార్కెట్ నుంచి మార్కండేయనగర్ వరకు రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌషిక్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు కరాటే రాజు, లక్ష్మీ, రవి, బాలాజీ, గడ్డం అశోక్, సతీష్ రెడ్డి, వేములవాడ మధన్‌మోహన్, జలంధర్ రెడ్డి, చందర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షాలు పంపిణీ...

డివిజన్‌లో పారిశుధ్య సమస్య పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టామని కార్పొరేటర్ సామల హేమ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేశారు. ఇంటింటి నుంచి చెత్తను సులభంగా సేకరించేందుకు రిక్షాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రూ.2.40 లక్షల వ్యయంతో 10 చెత్త సేకరణ రిక్షాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ వెంకటేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు గోపాల్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.





చింతబావిలో చెట్టు తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఈ ట్రాన్స్‌ఫార్మర్లు.. యమా డేంజర్!

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ చింతబావి ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం, పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో పచ్చని చెట్ల తీగలు విద్యుత్ తీగలను అల్లుకుని సరఫరాలో హెచ్చుతగ్గులకు కారణమవుతున్నాయి. దీంతో ఇళ్లలోని గృహోపకరణాలు కాలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవులు, మేకలు వంటి జంతువులు పచ్చికను తినేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురవుతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెట్ల కొమ్మలు, తీగలను తొలగించి, చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్త తరలింపు రిక్షాల అందజేత



రిక్షాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు చెత్త తరలింపు రిక్షాలు, పనిముట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంలో భాగంగానే చెత్తను సేకరించే రిక్షాలను అందజేసినట్లు తెలిపారు. ప్రజలు బాధ్యతగా నడుచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లు, రాంకీ సెక్షన్ ఇన్‌చార్జ్ దశరథ్, జవాన్ కామరాజు, ఎస్‌ఎఫ్‌ఏలు గబ్బర్, అఖిల్, గణేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

'పరిశుభ్ర హైదరాబాద్' ప్రారంభం



పరిశుభ్ర హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: జీహెచ్‌ఎంసీ పరిధిలో వారసత్వ స్థలాల వద్ద వ్యర్థాల తొలగింపు కోసం నిర్వహించ తలపెట్టిన 21 రోజుల ప్రత్యేక కార్యాచరణను బుధవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి తార్నాకలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 8 వరకు కొనసాగే ఈ కార్యక్రమం ద్వారా నగర పరిశుభ్రతను పెంచడంతోపాటు వారసత్వ స్థలాల సంరక్షణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. దీనికి నగర ప్రజలందరూ సహకరించాలని డిప్యూటీ మేయర్ కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మోడల్ కాలనీ ప్రతినిధులు

సనత్‌నగర్: మోడల్ కాలనీ, సుందర్‌నగర్‌లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి మాట్లాడుతూ ప్రజారోగ్య విషయంలో కీలకంగా వ్యవహరించే పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలోనే సోసియేషన్ దుప్పట్ల పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాజేశ్వరి, నాగమణి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణనను స్వాగతిస్తున్నాం..

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణనను స్వాగతిస్తున్నామని ఓయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం క్యాంపస్‌లోని పూలే, అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లోని పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసిన్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. బీసీ సంఘాల పోరాటాల ఫలితంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ మహేష్ కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కాలేజీలోని ఎంకాం, ఎంకాం(ఐఎస్) నాల్గో సెమిస్టర్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 90 శాతం మంది విద్యార్థులు డెలాయిట్, యూఎస్ కన్సల్టెంట్లుగా రూ.7.6 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను తన కార్యలయంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అభినందించారు.

కాంగ్రెస్ 'మహా' విజయం తథ్యం

ఏఐసీసీ పరిశీలకురాలు కోట నీలిమ



సమావేశంలో కోట నీలిమ

సనత్‌నగర్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమని ఆ రాష్ట్ర అమరావతి పార్లమెంటరీ నియోజకవర్గ ఏఐసీసీ పరిశీలకురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఏఐసీసీ పరిశీలకుల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పే మాయమాటలు నమ్మే పరిస్థితిలో మహారాష్ట్ర ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారానే నిజమైన అభివృద్ధి, సంక్షేమం జరుగుతాయని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. తాను ఏఐసీసీ పరిశీలకురాలిగా వ్యవహరిస్తున్న అమరావతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎటు చూసినా కాంగ్రెస్ హవా కనిపిస్తోందన్నారు.

ప్రొఫెసర్ వెంకటరమణ తొలగింపు హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ప్రొఫెసర్ వెంకటరమణను పదవి నుంచి తొలగించడంపట్ల ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా కొనసాగుతూ ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన వెంకటరమణ విద్యార్థులను పలు విధాలుగా వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన వెంకటరమణపైన విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనకు ఇక ఎలాంటి పదవులు ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని కోరారు.

ఓయూ వీసీగా మాల ప్రొఫెసర్‌ను నియమించండి

ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షుడుఅంగరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో జరిగిన అంసా సమావేశంలో వారు మాట్లాడుతూ ఓయూను ప్రారంభించేందుకు రెండు వేల ఎకరాల భూమిని దానం ఇచ్చిన లఖాభాయ్ చందా కూడా మాల సామాజిక వర్గానికి చెందిన మహిళ అని గుర్తు చేశారు. కానీ, 107 ఏళ్ల ఓయూ చరిత్రలో ఇంతవరకు ఎస్సీలకు వీసీ పదవి దక్కకపోవడం శోచనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓయూ చరిత్రను పూర్తిగా అధ్యయనం చేసి మాల అధ్యాపకులకు వీసీగా అవకాశం ఇవ్వాలన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



లక్ష్మమ్మ(ఫైల్)

అడ్డగుట్ట: ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటకకు చెందిన లక్ష్మమ్మ(80) ఈ నెల 1న మహేంద్రాహిల్స్‌లో నివాసముంటున్న తన కూతురు సావిత్రి ఇంటికి వచ్చింది. 4వ తేదీన అడ్డగుట్టలోని వెంకట్‌నగర్‌లో ఉంటున్న తన కుమారుడు రాము ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం సావిత్రి తన సోదరుడు రాముకు ఫోన్ చేసి తల్లి గురించి అడుగగా తన ఇంటికి రాలేదని చెప్పాడు. దీంతో బంధువులను వాకబు చేసినా, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం రాత్రి తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు సన్మానం



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి బుధవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లు, సీట్లే కావాలి: ఈటల



ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందువుల పట్ల, హిందువుల విశ్వాసాల పట్ల ఏ మాత్రం విశ్వాసం లేదని, కేవలం ఓట్లు, సీట్లే దానికి కావాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి ఆయన కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమ, రాష్ట్ర ప్రగతిపై ఏ మాత్రం శ్రద్ధ లేదని, దీనికి ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం సజీవ సాక్ష్యమని అన్నారు. ఆలయంలో ఇంత జరిగినా మంత్రి ఇక్కడి రాలేదని, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైతే ప్రజల విశ్వాసాలను, ప్రజలను కాపాడుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందుంటుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే, సరియైన సమాచారం ఇవ్వకుంటే కేంద్ర ఏజెన్సీలు ముందుకు వచ్చి నిజాలు నిగ్గు తేలుస్తాయని అన్నారు. దీని వెనుక ఎవరున్నారు, ఎందువల్ల జరిగిందో తేల్చి, ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేస్తామని చెప్పారు. దేశంలో ప్రశాంతత, అందరి విశ్వాసాలు కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఇరిసెట్‌లో ముగిసిన స్వచ్ఛత పఖ్వాడ



బహుమతులు అందజేస్తున్న శరద్‌కుమార్

లాలాపేట: తార్నాకలోని ఇరిసెట్‌లో కొనసాగుతున్న స్వచ్ఛత పఖ్వాడ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా అధికారులు స్వచ్ఛత ప్రాముఖ్యతపై పలు సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్‌కుమార్ శ్రీవాత్సవ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై సమీక్ష సమావేశం

ఉప్పల్: చిలుకానగర్‌ను చెత్త రహిత డివిజన్‌గా మార్చేందుకు మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్ ఉప్పల్ సర్కిల్ శానిటరీ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం వార్డు కార్యాలయంలో సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జీవీపీ పాయింట్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ అసోసియేషన్ల ముందుకు వస్తున్నట్లు వివరించారు. వారి సహకారంతోనే సీసీ కెమెరాలను అమర్చుకుందాం అని పిలుపునిచ్చారు. శానిటరీ సిబ్బంది ఎలాంటి అలసత్వం లేకుండా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. బన్నాల ప్రవీణ్, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ఇటిక్యాల పురుషోత్తంను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను బుధవారం టీజాక్ హైదరాబాద్ చైర్మన్ శ్రీరామ్ శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. టీజాక్ తెలంగాణ చైర్మన్‌గా ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం చేసిన ఉద్యమాలను గుర్తించి ఈఅవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రొఫెసర్ పురుషోత్తం నియామకంపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఓయూ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకంపట్ల తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఓయూ రీసెర్చ్ స్కాలర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వలిగొండ నరసింహ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. దళిత బహుజన సామాజిక వర్గానికి చెందిన పురుషోత్తం పొలిటికల్ జేఏసీ నేతగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పురుషోత్తం సేవలను గుర్తించి వైస్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వలిగొండ నరసింహ పేర్కొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

- అమీర్‌పేటలో కూల్చివేతలు మరూ
- లబోదిబోమంటున్న చిరువ్యాపారులు



అమీర్‌పేటలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు

సనత్‌నగర్: ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేతలు మొదలయ్యాయి. రహదారుల పక్కనున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. అమీర్‌పేట–పంజగుట్ట రహదారితోపాటు దుర్గామాత దేవాలయం, అమీర్‌పేట ధరంకరం రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను భారీ బందోబస్తు నడుమ కూల్చివేశారు. అయితే ఫుట్‌పాత్‌లపై చిన్న, చిన్న షాపులు నిర్వహిస్తున్న చిరువ్యాపారులు లబోదిబోమంటున్నారు. తమ ఉపాధిని దెబ్బతీశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపును ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్ కట్టా పర్యవేక్షించారు. ఈ తొలగింపు ప్రక్రియను మరో నాలుగైదు రోజులు కొనసాగిస్తామని ట్రాఫిక్ అధికారులు వెల్లడించారు. ట్రాఫిక్ సాఫీగా సాగేలా చేపట్టిన ఆక్రమణల కూల్చివేతకు అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా



తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు





సనత్‌నగర్: ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించిన 75 మందిపై ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్పెషల్ డ్రైవ్ పేరిట వివిధ రకాల ఉల్లంఘనులను గుర్తించి జరిమానా విధించి కేసులు నమోదు చేశారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఆధ్వర్యంలో ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఇతర సిబ్బంది అమీర్‌పేట మైత్రీవనం, ఎస్సార్‌నగర్, సత్యం థియేటర్ చౌరస్తాల్లో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా వ్యక్తిగత వాహనాలపై గవర్నమెంట్ డ్యూటీ అంటూ, జీహెచ్‌ఎంసీ, పోలీసు, ఇతరత్రా అంటించిన స్టిక్కర్లను తొలగించారు. వివిధ రకాలుగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అడ్డంకులు సృష్టించడంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాటిని తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మైనర్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేయడం వల్ల వారితోపాటు ఇతర వాహనదారులు ప్రమాదంలో పడతారని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతు బజారులో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో)... టమాటా రూ.43 నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 85, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 53, దొండ 35, గుండుబీన్స్ 145, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 35, బీట్‌రూట్ 32, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 45, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 17, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ ఒకటి రూ.3- రూ.4, ముల్లంగి ఒకటి రూ.4- రూ.6 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.